సాక్షి సూర్యాపేట

సోమవారం ၊ 11 ၊ నవంబర్ ၊ 2024



మద్దతు ధర కల్పించాలని..

ధాన్యానికి మద్దతు ధర కల్పించాలని ఆదివారం వేములపల్లి మండలం శెట్టిపాలెం వద్ద రైతులు ధర్నా చేపట్టారు.

- 8లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటిమట్టం :	590 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం	: 587.20 అడుగులు
ఇన్‌ఫ్లో	: 15,928 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	: 15,928 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	: నిల్
కుడికాల్వ ద్వారా	: 10,120 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	: 3,608 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	: 1,800
వరద కాల్వకు	: 400

మూసీ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం :	645 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం :	643.87 అడుగులు
ఇన్‌ఫ్లో	: 518.51 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	: 369 క్యూసెక్కులు
ఎడమకాల్వకు	: 48 క్యూసెక్కులు
కుడికాల్వకు	: నిల్

న్యూస్‌రీల్

మట్టపల్లిలో నిత్యారాధనలు



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో ఆదివారం నిత్యారాధనలు కొనసాగాయి. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, నిత్యహోమం, మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం, ప్రత్యేకార్చనలు చేశారు. అనంతరం శ్రీరాజ్యలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత శ్రీ ప్రహ్లాద యోగానంద శ్రీలక్ష్మీనరసింహస్వామిని నూతన పట్టు వస్త్రాలతో వధూవరులుగా అలంకరించి ఎదుర్కోలు మహోత్సవం చేపట్టారు. ఆ తర్వాత నిత్యకల్యాణం వైభవంగా నిర్వహించారు. స్వామి అమ్మవార్లను గరుడ వాహనంపై ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు రామాచార్యులు, పద్మనాభాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

చేపల పెంపకంతో ఆర్థికాభివృద్ధి సాధించాలి



జలాశయంలో చేపపిల్లలను వదులుతున్న అధికారులు, మత్స్య సొసైటీ ప్రతినిధులు

మఠంపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తున్న చేపపిల్లల పెంపకం ద్వారా మత్స్యకారులు ఆర్థికాభివృద్ధి సాధించాలని జిల్లా మత్స్యశాఖ అధికారి నాగునాయక్ అన్నారు. మఠంపల్లి మండలం యాతవాకిల్ల వద్ద గల వేములూరు జలాశయంలో ఆదివారం మత్స్య సహకార సంఘం (మత్స్య సొసైటీ) అధ్యక్ష, కార్యదర్శులు పంగా బక్కయ్య, కీసరి వెంకన్నతో కలిసి 5.62లక్షల చేప పిల్లలను వది లారు. అధికారి నాగునాయక్ మాట్లాడారు. అనంతరం మత్స్య సొసైటీ కార్యదర్శి వెంకన్న మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీటిపారుదల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహకారంతో ప్రభుత్వం రెండురకాల మంచి సైజ్ గల బొచ్చ, రవ్వ చేపపిల్లలను మంజూరు చేయడం పట్ల ధన్యవాదాలు తెలిపారు. మత్స్యకారులకు వాహనాలు, వలలు ఇప్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో మత్స్యకారులు బైరిబాలు, వెంకటేశ్వర్లు, నాగయ్య, పెద్దశ్రీను, నాగులు, కాశయ్య, వెంకన్న, రవి, ఉప్పలయ్య, గురువయ్య, సైదులు, మదార్, నరేష్, బాలనాగయ్య, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

నృసింహుడికి సంప్రదాయ పూజలు



సుదర్శన హోమం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం సంప్రదాయ పూజలు కొనసాగాయి. వేకువ జామున ప్రధానాలయాన్ని తెరిచిన అర్చకులు.. సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం స్వయంభూలు, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు నిజాభిషేకం, తులసీ పత్రాలతో అర్చన చేశారు. ఇక ప్రధానాలయ ప్రథమ ప్రాకార మండపంలో సుదర్శన నారసింహహోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, మహా ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన మూర్తులకు అష్టోత్తర పూజలు నిర్వహించారు. సాయంత్రం జోడు సేవను భక్తుల మధ్య ఊరేగించారు. రాత్రి శ్రీస్వామి, అమ్మవారికి శయనోత్సవం నిర్వహించి ఆలయాన్ని ద్వారా బంధనం చేశారు. అదే విధంగా కార్తీకమాసం కావడంతో భక్తులు పెద్దసంఖ్యలో సత్యనారాయణస్వామి వ్రతాలు ఆచరించారు. దీంతో ఆలయ ప్రాంగణం భక్తజన సంద్రమైంది.

ఆదాయం పెరిగేలా..



హుజూర్‌నగర్‌లో ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న దుకాణాలు

మున్సిపాలిటీల్లో ట్రేడ్ లైసెన్స్‌ల జారీకి కొత్త విధానం

- షాపు విస్తీర్ణం, ప్రాంతాన్ని బట్టి రుసుం కేటాయింపు
- వ్యాపార కేంద్రాల వివరాలు, ఫొటోల సేకరణకు రంగం సిద్ధం
- ఆన్‌లైన్‌లో నమోదు తర్వాత జియోట్యాగింగ్ చేసేలా సన్నాహాలు

ఈ ఆర్థిక సంవత్సరంలో వ్యాపార లైసెన్స్ పొందినవారు

మున్సిపాలిటీ	దుకాణదారులు
సూర్యాపేట	1,332
కోదాడ	370
హుజూర్‌నగర్	216
నేరేడుచర్ల	18
తిరుమలగిరి	15
మొత్తం	1,951

హుజూర్‌నగర్: మున్సిపాలిటీల్లో ఆదాయ వనరులు పెంచేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా ప్రధాన ఆదాయ వనరుల్లో ఒకటైన ట్రేడ్ లైసెన్స్‌ల జారీలో కొత్త పంథా అనుసరించాలని సర్కార్ ఆదేశించడంతో మున్సిపల్ అధికార యంత్రాంగం కసరత్తు ప్రారంభించింది. క్షేత్ర స్థాయిలో ఉన్న దుకాణాలకు, లైసెన్స్‌లు పొందే సంఖ్యకు పొంతన లేదు. దీంతో పాత విధానానికి పురపాలక శాఖ స్వస్తి పలికి నూతన విధానంలో అనుమతులు జారీ చేస్తుంది. మున్సిపాలిటీల్లోని అన్ని ప్రాంతాల్లో ఉన్న వ్యాపార కేంద్రాల వివరాలన్నింటినీ ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేస్తూ జియోట్యాగింగ్ చేసేలా ప్రణాళిక రూపొందించారు.

ఆర్థికంగా నలిగిపోకుండా..

పట్టణాల్లో వేలాది దుకాణాలు ఉన్నా వందల్లోనే వ్యాపార అనుమతులు తీసుకుంటున్నారు. ఒక్కో దుకాణం నుంచి సుమారు రూ 2వేలకు పైబడి రుసుం చెల్లించాల్సి ఉంటుంది. వివిధ విభాగాలకు అనుగుణంగా రూ.20 వేల వరకు రుసుం స్వీకరిస్తున్నారు. అతితక్కువగా యజమానులు అనుమతులు పొందుతుండడంతో మున్సిపాలిటీలకు ఆదాయం లేక ఆర్థికంగా నలిగిపోతున్నాయి. ఈ సమస్యను అధిగమించేందుకు నూతన విధానాన్ని అనుసరించేందుకు అధికారులు రంగం సిద్ధం చేశారు.

అధిక రుసుం భరించలేక..

పట్టణాల్లోని వాణిజ్య దుకాణాలకు హరిత రుసుం రూ.వెయ్యి వసూలు చేస్తున్నారు. దుకాణ వైశాల్యానికి, దుకాణం ఉన్న ప్రదేశం అనుగుణంగా రుసుం నిర్దేశిస్తున్నారు. వేలాది రూపాయల అధిక రుసుం భరించలేక అనేక మంది దుకాణాల యజమానులు అనుమతి పత్రాలు పొందేందుకు వెనుకడుగు వేస్తున్నారు. ఈ సమస్య పరిష్కారానికి యంత్రాంగం ప్రత్యేక దృష్టి పెట్టి క్షేత్రస్థాయిలో చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించింది.

లైసెన్స్ తప్పనిసరి



ప్రభుత్వ ఆదేశాల మేరకు మున్సిపాలిటీల పరిధిలో వ్యాపార దుకాణాల ఫొటోలు చేసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తాం. వాటికి జియోట్యాగింగ్ విధానంలో కొలతలు వేసి దాని ఆధారంగా పన్ను ఖరారు చేస్తాం. దుకాణదారులు తప్పకుండా లైసెన్స్ పొందాలి. అనుమతులు ఉన్న వారే ఇన్స్యూరెన్స్ పొందేందుకు అర్హులవుతారు. అనుమతులు లేకుండా దుకాణాలు ఏర్పాటు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

– కె.శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ కమిషనర్, హుజూర్‌నగర్

జియోట్యాగింగ్ చేసేలా..

పట్టణాల్లో ఎలాంటి అనుమతులు పొందకుండా నెలకు రూ.లక్షల్లో ఆర్జిస్తున్న వారు కొందరున్నారు. నయాపైసా చెల్లించకుండా మున్సిపాలిటీల ఆదాయానికి గండి కొడుతున్నారు. ఏళ్ల నుంచి మున్సిపాలిటీలకు ఆదాయం సమకూరకున్నా అధికారులు మిన్నకుండిపోతున్నారు. ఇటువంటి సమస్యలను అధిగమించేందుకు తాజాగా సర్కారు ఆదేశాలతో ప్రతి దుకాణం చిత్రాలు సేకరించి జియోట్యాగింగ్ చేసేలా చర్యలు చేపట్టనున్నారు. జియోట్యాగింగ్ చేసిన అనంతరం పన్నులు ఖరారు చేయనున్నారు.

సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలి

- అదనపు కలెక్టర్ రాంబాబు



నేరేడుచర్లలో సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ రాంబాబు

నేరేడుచర్ల: కుటుంబ సమగ్ర సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబు అన్నారు. నేరేడుచర్ల పట్టణంలో కొనసాగుతున్న సర్వేను ఆదివారం ఆయన పరిశీలించారు. అలాగే నేరేడుచర్ల పీఏసీఎస్‌లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, స్థానిక ప్రాథమిక పాఠశాలలో ఓటరు నమోదు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 3.75 లక్షల గృహాలను గుర్తించి మొత్తం 2,353 బ్లాకులుగా విభజించి 2,711 మందిని ఎన్యూమరేటర్లు, 276 మంది సూపర్‌వైజర్లతో సర్వే చేయిస్తున్నామన్నారు. సర్వేకు వచ్చే ఎన్యూమరేటర్లకు ప్రజలు సహకరించాలన్నారు. జిల్లాలో 310 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి 3.70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామన్నారు. రైతులు ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి మద్దతు ధరతో పాటు బోనస్ పొందాలన్నారు. 2025 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేయించుకోవాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ సురిగి సైదులు, మున్సిపల్ కమిషనర్ యడవల్లి అశోక్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ మౌనిక, ఆర్‌ఐ నర్సయ్య తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయ సమస్యలపై ఉద్యమిస్తాం

- పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి



తుంగతుర్తిలో మాట్లాడుతున్న శ్రీపాల్‌రెడ్డి

తుంగతుర్తి: ఉపాధ్యాయ సమస్యలపై ఉద్యమిస్తూ వాటి పరిష్కారానికి నిరంతరం కృషిచేస్తానని పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు, నల్లగొండ, ఖమ్మం, వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోవర్గ అభ్యర్థి పింగలి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం తుంగతుర్తి మండల కేంద్రంలోని పద్మాశాలి భవన్‌లో జరిగిన ఎమ్మెల్సీ సన్మాహక సమావేశంలో పాల్గొని మాట్లాడారు. త్వరలో జరగబోయే నలగొండ, ఖమ్మం, వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో మొదటి నుంచి పీఆర్‌టీయూ ముందుందన్నారు. ప్రభుత్వ ప్రవేశపెట్టిన సీపీఎస్ విధానంతో పాటు 317 జీవోతో ఉపాధ్యాయులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ విషయాలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నామని పేర్కొన్నారు. సీపీఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించేందుకు రాష్ట్రంలోనే అన్ని ఉపాధ్యాయ సంఘాలను ఏకం చేసి ఉద్యమిస్తామన్నారు. రాష్ట్రంలో 22వేల మంది ఉపాధ్యాయులకు పదోన్నతి కల్పించిన చరిత్ర ఒక్క పీఆర్‌టీయూ సంఘానికే దక్కిందన్నారు. ఉపాధ్యాయుల ఉమ్మడి సర్వీస్ రూల్స్ సాధించేందుకు పోరుబాట ఆగదన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూటీఎస్ జిల్లా సంఘం అధ్యక్షుడు తంగెళ్ల జితేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి తీగల నరేష్, నల్లగొండ, యాదాద్రి జిల్లాల అధ్యక్షులు డీవీ.ఫణి కుమార్, కుంట్ల అమరేందర్‌రెడ్డి, ఆయా జిల్లాల సంఘం ప్రతినిధులు మేకల జాన్‌రెడ్డి, సుంకరి భిక్షంగౌడ్, బొలికొండ కోటయ్య, కృపాకర్‌రెడ్డి, జ్యోతుల చంద్రశేఖర్, వీరబాబు, రామలింగారెడ్డి, వెంకటయ్య, కందుకూరి శివశంకర్, లక్ష్మీనారాయణ, పాటి సుధీర్‌రెడ్డి, చంద్రశేఖర్, గుజ్జ భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

పాలకులవి మోసపూరిత హామీలు

- మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి



మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

హుజూర్‌నగర్: ప్రజలకు మోసపూరిత హామీలు ఇస్తూ పాలకులు పబ్బం గడుపుతున్నారని, వారి విధానాలను ప్రజలు గమనించాలని సీపీఎం రాష్ట్ర కార్య కార్యదర్శి వర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. ఆదివారం హుజూర్‌నగర్‌లో నిర్వహించిన సీపీఎం పట్టణ కమిటీ మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం దేశ సంపదను బడా కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతోందని ఆరోపించారు. ఆరు హామీల అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వంపై పోరాడాలన్నారు. ఈనెల 29న సూర్యాపేటలో పార్టీ జిల్లా మహాసభల సందర్భంగా ఏర్పాటు చేసే బహిరంగ సభకు అన్ని వర్గాల ప్రజలు వేలాదిగా కదిలి రావాలని పిలుపునిచ్చారు. అనంతరం సీపీఎం పట్టణ కార్యదర్శిగా పల్లె వెంకటరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సభలో సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నాగారపు పాండు, పారేపల్లి శేఖర్‌రావు, జిల్లా కమిటీ సభ్యులు పల్లె వెంకట్‌రెడ్డి, కె.అనంత ప్రకాష్, దుగ్గి బ్రహ్మం, భూక్యా పాండు నాయక్, కౌన్సిలర్ త్రివేణి, లక్ష్మి, నాయకులు మురళి, శీలం శ్రీను, యోన, లింగమ్మ, వీరమల్లు, జె.వెంకటేశ్వర్లు, పి.హుస్సేన్, బాలునాయక్, వెంకట్ నారాయణ, నాగేశ్వరరావు, వెంకన్న, జనార్దన్‌రావు, పట్టణ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

17న సెకండ్ ఏఎన్‌ఎంల మహాసభ

నల్లగొండ టౌన్ : రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లో ఈ నెల 17న జరిగే సెకండ్ ఏఎన్‌ఎంల రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు తోట రామాంజనేయులు కోరారు. ఆదివారం నల్లగొండ జిల్లా కేంద్రంలో జరిగిన రెండో ఏఎన్‌ఎంల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వైద్యరంగంలో విలువైన సేవలందిస్తున్న రెండో ఏఎన్‌ఎంల విషయంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. వయసు రీత్యా పరీక్ష రాసే అర్హత లేని ఏఎన్‌ఎంలకు వంద శాతం మూల వేతనంతో పాటు రిటైర్మెంట్ సమయంలో రూ.10 లక్షల గ్రాట్యుటీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం నల్లగొండ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్, సభ్యులు పి.రత్నకుమారి, రాయల గీతారాణి, పుష్పలత, ఆర్.అరుణ మేరీ, హైమావతి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రామాంజనేయులు

పేదల సమస్యలే ఎజెండాగా సీపీఐ పోరు



మాట్లాడుతున్న గన్నా చంద్రశేఖర్

హుజూర్‌నగర్ : పేద ప్రజల సమస్యలే ఎజెండాగా సీపీఐ పోరాడుతుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం సీపీఐ వందోవ ఆవిర్భావ వేడుకల్లో భాగంగా హుజూర్‌నగర్ పట్టణంలోని గాంధీపార్కు సెంటర్ నుంచి సీపీఐ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక పార్టీ కార్యాలయంలో సీనియర్ నాయకులను శాలువా, పూలమాలలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా.. సమ సమాజ స్థాపనే లక్ష్యంగా వందేళ్ల క్రితం దేశంలో కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించిందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాములు, నాయకులు కంబాల శ్రీనివాస్, ఎం.వెంకటేశ్వర్లు, ఉస్తెల నారాయణరెడ్డి, దేవరం మల్లీశ్వరీ, ధూళిపాళ ధనుంజయ నాయుడు, గుండు వెంకటేశ్వర్లు, జడ శ్రీనివాస్, దొంతగాని సత్యనారాయణ, జడ వెంకన్న, సోమగాని కృష్ణ, ఇందిరాల వెంకటేశ్వర్లు, సుందరి పద్మ, జక్కుల రమేష్ పాల్గొన్నారు.

‘పెన్నా’ విస్తరణపై 12న ప్రజాభిప్రాయ సేకరణ

మిర్యాలగూడ: నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం గణేష్‌పాడు వద్ద గల పెన్నా సిమెంట్(అంబుజా) కంపెనీ గనుల విస్తరణ, సున్నపురాయి ఉత్పత్తి పెంపుపై ఈనెల 12న పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించనున్నారు. 2002లో పెన్నా సిమెంట్స్‌ను నెలకొల్పగా రెండు నెలల క్రితం ఈ ప్లాంట్‌ను అదానీ గ్రూప్ కొనుగోలు చేసింది. అనధికారికంగా గనుల విస్తరణ జరిగినప్పటికీ వివిధ కారణాల వల్ల పీసీబీ ప్రజాభిప్రాయం సేకరించలేదు. దీనిపై ప్రభుత్వానికి పలువురు ఫిర్యాదులు చేయడంతో ఈనెల 12న ప్లాంట్‌కు సమీపంలో అధికారులు సమావేశాన్ని నిర్వహించి ప్రజల అభిప్రాయాలు స్వీకరించనున్నారు. దామరచర్ల మండలంలో గణేష్‌పాడు పరిధిలో 304 హెక్టార్ల భూమిని సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలం శూన్యపహాడ్ పరిధిలో 50 హెక్టార్లలో మైనింగ్ లీజు ఉంది. 354 హెక్టార్ల సున్నపురాయి గనులను విస్తరించి ఉత్పత్తి సామర్థ్యాన్ని ఏడాదికి 1.5మిలియన్ టన్నుల నుంచి 1.8 మిలియన్ టన్నులకు పెంచేందుకు అనుమతి కోసం పరిశ్రమ యాజమాన్యం దరఖాస్తు చేసుకుంది. ఈ నేపథ్యంలో పీసీబీ నిర్వహించే సమావేశానికి ప్రభావిత గ్రామాల ప్రజలు హాజరుకానున్నారు.

నిబంధనలు అతిక్రమించారని ఫిర్యాదు

గనుల శాఖ మంజూరు చేసిన అనుమతులు జనవరి 2022లో ముగిసినప్పటికీ పరిశ్రమ యాజమాన్యం అక్రమంగా తవ్వకాలు చేశారని సామాజిక కార్యకర్తలు, పర్యావరణ వేత్తలు పదిరోజుల క్రితం జాతీయ హరిత ట్రిబ్యునల్, పీసీబీకి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. అటవీ భూములను ఆక్రమించి, రెవెన్యూ హద్దులు చెరిపి నిబంధనలకు విరుద్ధంగా మైనింగ్ నిర్వహించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

పాటిమట్ల వాసికి బిజినెస్ ఎక్స్‌లెన్స్ అవార్డు

మోత్కూరు: మండలంలోని పాటిమట్ల గ్రామానికి చెందిన పారిశ్రామికవేత్త, మదర్ డెయిరీ డైరెక్టర్ రచ్చ లక్ష్మీనర్సింహారెడ్డి మలేషియా తెలంగాణ అసోసియేషన్ (ఎంవైటీఏ) వారి బిజినెస్ ఎక్సలెన్స్ అవార్డు అందుకున్నారు. మలేషియాలోని కౌలాలంపూర్‌లో జరిగిన తెలంగాణ అసోసియేషన్ దశాబ్ది వేడుకల్లో ఆయన అవార్డు ప్రదానం చేశారు. ఈ వేడుకల్లో మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిషోర్‌కుమార్, బూడిద భిక్షమయ్యగౌడ్, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, బీఆర్ఎస్ నేతలు చింతల వెంకటేశ్వరరెడ్డి, ఒంటెద్దు నర్సింహారెడ్డి, గుజ్జ యుగేంధర్‌రావు పాల్గొన్నారు.

కష్టపడితేనే లక్ష్య సాధన సులువు



ఉద్యోగాలు సాధించిన వారిని సన్మానిస్తున్న గ్రంథాలయ సంస్థ చైర్మన్, నిర్వాహకులు

కోదాడ రూరల్: ఏ రంగంలోనైనా కష్టపడితేనే లక్ష్య సాధన సులువని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు అన్నారు. కోదాడ పట్టణంలోని గ్రంథాలయంలో చదువుకొని ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన పలువురిని ఆదివారం గ్రంథాలయంలో జిల్లా గ్రంథాలయ సెక్రటరీ బాలమ్మతో కలిసి ఆయన సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువులో ప్రతిభ చూపి తల్లిదండ్రులు కలలను నిజం చేయాలన్నారు. ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులు మెరుగైన సమాజ నిర్మాణం కోసం కృషి చేయాలన్నారు. పోటీ పరీక్షలకు ప్రిపేరయ్యే విద్యార్థులు పట్టువీడకుండా ప్రయత్నిస్తూనే ఉండాలన్నారు. కార్యక్రమంలో మాజీ గ్రంథాలయ చైర్మన్ రహీం, పిల్లుట్ల శ్రీనివాస్, లలితాదేవి, మంగమ్మ, రమేష్, నాగమ్మ, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా ప్రహరీ క్లబ్‌ల నిర్వహణ

- విద్యార్థులు మత్తు పదార్థాలు, మద్యం బారిన పడకుండా ప్రభుత్వం చర్యలు
- విధి విధానాలు తప్పక అమలు చేయాలని విద్యా శాఖ ఆదేశం
- జిల్లాలో గతేడాది 393 ప్రహరీ క్లబ్‌ల ఏర్పాటు



హుజూర్‌నగర్ ఉన్నత పాఠశాలలో యోగా సాధన చేస్తున్న విద్యార్థులు (ఫైల్)

హుజూర్‌నగర్: పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు మత్తు పదార్థాలు, మద్యం బారిన పడకుండా ఉన్నత పాఠశాలల్లో గతేడాది ఏర్పాటు చేసిన ప్రహరీ క్లబ్‌ల నిర్వహణ ఇకనుంచి పక్కాగా ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. గత విద్యా సంవత్సరంలో ప్రహరీ క్లబ్‌లు ఏర్పాటైనా నామమాత్రంగానే పనిచేస్తున్నాయి. చాలా చోట్ల క్లబ్‌ల విధివిధానాల ప్రకారం సమాచార, ఫిర్యాదుల పెట్టెలు అందుబాటులో లేవు. టోల్ ఫ్రీ నంబర్లు రాయించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రహరీ క్లబ్‌ల నిర్వహణ పకడ్బందీగా ఉండాలని రాష్ట్ర విద్యా శాఖ తాజాగా ఆదేశాలు జారీచేసింది. దీంతో జిల్లా విద్యా శాఖ యంత్రాంగం ప్రహరీ క్లబ్‌లను బలోపేతం చేసే దిశగా అడుగులు వేస్తోంది.

ప్రహరీ క్లబ్‌లు ఏర్పాటైన హైస్కూళ్లు

ప్రభుత్వ	244
ప్రైవేట్	149
విద్యార్థుల సంఖ్య	40,000

మొత్తం 393 క్లబ్‌లు

ఉన్నత పాఠశాలల్లోకి మత్తు పదార్థాలు, మద్యం తేకుండా కట్టడి చేసేందుకు గతేడాది జిల్లా వ్యాప్తంగా మొత్తం 393 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ప్రహరీ క్లబ్‌లు ఏర్పాటు చేశారు. అయితే వీటిల్లో గతేడాది చదివిన పదో తరగతి విద్యార్థులు వెళ్లిపోవడంతో కొత్తగా వచ్చిన ఆరో తరగతి విద్యార్థులతో కలిపి తరగతి స్థాయిలో, పాఠశాల స్థాయిలో ఈ క్లబ్‌లను ఏర్పాటు చేయనున్నారు. ప్రతి తరగతికి ఇద్దరు బాలికలు, ఇద్దరు బాలురు చొప్పున ఎంపిక చేస్తారు. వీరిలో చురుగ్గా ఉండే వారిని లీడర్లుగా మిగతా వారిని సభ్యులుగా నియమిస్తారు. ఇలా తరగతి స్థాయిలో 20 మంది, పాఠశాల క్లబ్‌లో ఐదుగురు సభ్యులుగా ఉంటారు. వీరికి వివిధ శాఖల అధికారుల సహకారం ఉంటుంది.

విద్యార్థుల్లో క్రమశిక్షణ పెరుగుతుంది



అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఉన్నత పాఠశాలల్లో తప్పనిసరిగా ప్రహరీ క్లబ్‌లను ఏర్పాటు చేసి వాటిని పకడ్బందీగా అమలు చేయాలని రాష్ట్ర విద్యాశాఖ నుంచి ఆదేశాలు వచ్చాయి. ఆయా ఆదేశాలను సంబంధిత హైస్కూళ్ల హెచ్‌ఎంలకు కూడా పంపించాం. ప్రహరీ క్లబ్‌లు బాగా పనిచేస్తే విద్యార్థుల్లో క్రమశిక్షణగా పెరిగేందుకు ఆస్కారం ఉంటుంది. జిల్లాలోని అన్ని చోట్లా అమలయ్యేలా చర్యలు తీసుకుంటాం.

– అశోక్, డీఈఓ, సూర్యాపేట

క్లబ్‌లు చేయాల్సిన పనులు..

- ప్రతి పాఠశాలలో తప్పనిసరిగా డ్రగ్ రహిత సూచిక బోర్డు ఉంచాలి. మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన నినాదాలు పాఠశాల లోపల, బయట రాసి పెట్టాలి.
- సూచనల పెట్టె ఏర్పాటు చేసి, వాటిపై తరుచూ సమీక్షలు నిర్వహించాలి.
- పాఠశాల ఆవరణంలో విద్యార్థులందరికీ కనిపించేలా తప్పనిసరిగా టోల్‌ఫ్రీ నంబర్లు 1800, 599, 6969, 110031 రాయించాలి.
- క్లబ్ సభ్యులు ప్రతినెలా సమావేశాలు ఏర్పాటు చేసుకొని కార్యక్రమాల పురోగతిపై చర్చించాలి.
- పాఠశాల నుంచి 100 మీటర్ల దూరంలో మద్యం, పొగాకు, నార్కోటిక్ పదార్థాలు, జంకుఫుడ్ అమ్మకుండా చూడాలి.
- జీవన నైపుణ్యాల విద్య అమలయ్యేలా తరగతులు నిర్వహించాలి.
- పౌష్టికాహారం గురించి అవగాహన కల్పించడంతోపాటు ఆటలాడించి యోగా చేయించేలా చూడాలి. ప్రస్తుతం ఇవేమీ అమలు జరుగుతున్న దాఖలాలు కనిపించడం లేదు.

క్లుప్తంగా

బెల్టు షాపులు తొలగించాలని ర్యాలీ

ఆత్మకూర్(ఎస్): మండల పరిధిలోని బోరింగ్ తండాలో బెల్టు షాపులను తొలగించాలని మహిళలు, యువకులు ఆదివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, యువకులు గ్రామంలో సమావేశం నిర్వహించి గ్రామంలో బెల్టు షాపులు తొలగించాలని తీర్మానించారు. బెల్టు షాపుల నిర్వాహకులకు మద్యం అమ్మొద్దని కోరారు. వీరికి మండల జేఏసీ మద్దతు తెలిపింది. ఈ కార్యక్రమంలో బుజ్జి, పద్మ, మంజుల తదితరులు ఉన్నారు.

సూర్యక్షేత్రంలో వైభవంగా సౌరహోమం



సూర్యక్షేత్రంలో పూజలు చేస్తున్న భక్తులు

అర్వపల్లి: జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురంలోని అఖండజ్యోతి స్వరూప సూర్యనారాయణస్వామి క్షేత్రంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున ఉషాపద్మిని ఛాయా సమేత సూర్యనారాయణస్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు జరిపించారు. అనంతరం యజ్ఞశాలలో మహాసౌరహోమాన్ని వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో క్షేత్ర వ్యవస్థాపకుడు జనార్దన్‌స్వామి, గణపురం నరేష్, ఇంద్రారెడ్డి, అర్చకులు భీంపాండే, శ్రీరాంపాండే, అంకిత్ పాండే, భక్తులు పాల్గొన్నారు.

బాలికపై లైంగికదాడి చేసిన వ్యక్తి అరెస్ట్

చందంపేట : బాలికను కిడ్నాప్ చేసి లైంగిక దాడి చేసిన వ్యక్తిని ఆదివారం పోలీసులు అరెస్ట్ చేశారు. చందంపేట మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికను అదే గ్రామానికి చెందిన సమీప బంధువు చాట్ల తిరుపతి 15రోజుల క్రితం కిడ్నాప్ చేశాడు. బాలికను స్నేహితుల సహాయంతో నేరేడుగొమ్ము మండలంలోని ఓ గ్రామంలో ఉంచి లైంగికదాడి చేశాడు. కొద్ది రోజులుగా బాలిక కనిపించకపోవడంతో ఆమె కుటుంబ సభ్యులు ఇటీవల పోలీసులకు ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న తిరుపతి బాలికను రెండు రోజుల క్రితం స్వగ్రామంలో విడిచిపెట్టి పరారయ్యాడు. బాలిక కుటుంబ సభ్యులు మరోమారు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నిందితుడిని ఆదివారం స్వగ్రామంలో అరెస్ట్ చేశారు. నిందితుడు తిరుపతిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చినట్లు ఎస్ఐ సతీష్ తెలిపారు.

రోడ్డు దాటుతుండగా కారు ఢీకొని వ్యక్తి దుర్మరణం

చిట్యాల: విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై చిట్యాల మండలం గుండ్రాంపల్లి వద్ద ఓ వ్యక్తి రోడ్డు దాటుతుండగా కారు ఢీకొని మృతిచెందాడు. ఎస్ఐ ఎన్. ధర్మా తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని దిల్‌సుఖ్‌నగర్‌కు చెందిన కోల్లా రఘునాథగుప్త(43) గుండ్రాంపల్లి గ్రామ శివారులోని సుంకెనపల్లి గ్రామానికి వెళ్లే రోడ్డులో ఓ వెంచర్‌లో ప్లాట్ చూసేందుకు వచ్చాడు. అనంతరం ఆయన తిరిగి దిల్‌సుఖ్‌నగర్‌కు ఆర్టీసీ బస్సులో వెళ్లేందుకు గాను గుండ్రాంపల్లి వద్ద జాతీయ రహదారిని దాటుతుండగా చిట్యాల నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు అతడిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రఘునాథగుప్త అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడు హైదరాబాద్‌లో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మద్దతు ధర కల్పించాలని రైతుల ధర్నా



నార్కట్‌పల్లి - అద్దంకి రహదారిపై మద్దతు ధర కోసం రాస్తారోకో చేస్తున్న రైతులు

- నార్కట్‌పల్లి – అద్దంకి రహదారిపై నిరసన తెలిపిన అన్నదాతలు

వేములపల్లి: ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు మద్దతు ధర రాకపోవడంతో రైతులు రాస్తారోకోకు దిగారు. ఖరీఫ్ సీజన్‌లో వర్షాలు సమృద్ధిగా కురవడంతో రైతులు వరి పంటను ఎక్కువగా సాగు చేశారు. ఇదే అదనుగా తీసుకున్న మిల్లర్లు రైతులు తీసుకొచ్చే ధాన్యానికి మద్దతు ధర కల్పించకుండా చౌక ధరకు అడగడంతో ఆగ్రహం చెందిన రైతులు వారు తీసుకొచ్చిన ధాన్యం ట్రాక్టర్లను ఆదివారం వేములపల్లి మండలం శెట్టిపాలెం వద్ద నార్కట్‌పల్లి– అద్దంకి రహదారిపై అడ్డంగా నిలిపి ధర్నాకు దిగారు. ప్రభుత్వం మద్దతు ధరను కల్పించాలని మిల్లర్లకు చెబుతున్నా పట్టించుకోకుండా సిండికేట్‌గా మారి రైతులను దోచుకుంటున్నారని ఆరోపించారు. రూ.2400కు కొనాల్సిన ధాన్యాన్ని రూ.2100, రూ.2200కే అడుగుతున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వారం కిందట మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి రైతులకు మద్దతు ధర కల్పించాలని మిల్లర్లను కోరినా ఎమ్మెల్యే మాటను లెక్కచేయకుండా అడ్డగోలు రేట్లు పెడుతున్నారని అన్నారు. రైతులు ధర్నా చేపట్టడంతో నార్కట్‌పల్లి–అద్దంకి రహదారిపై కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. దీంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ కోటేశ్వరి, పోలీసులు రాస్తారోకో వద్దకు చేరుకుని రైతులకు నచ్చజెప్పి గిట్టుబాటు ధర కల్పించే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పడంతో రైతులు ఆందోళన విరమించారు.



మిల్లుల ఎదుట బారులుదీరిన ధాన్యం ట్రాక్టర్లు

- అన్నదాత ఆలోచన అదిరింది



ధాన్యాన్ని తూర్పార పట్టడానికి జాజిరెడ్డిగూడెం మండలం కాసర్లపహాడ్‌కు చెందిన రైతు నల్లగుంట్ల శ్రీనివాస్ సరికొత్త ఆలోచన చేశాడు. ఆదివారం అర్వపల్లిలోని తన టెంట్‌హౌస్‌కు చెందిన జంబో కూలర్‌ను ఉపయోగించి కుటుంబ సభ్యులతో కలిసి ధాన్యాన్ని తూర్పార పట్టగా.. రోడ్డు వెంట వెళ్లే వారు ఆసక్తిగా తిలకించారు. ఐడియా భలే ఉంది అంటూ అభినందించారు. - అర్వపల్లి

ధాన్యం ట్రాక్టర్‌ను ఢీకొట్టిన డీసీఎం

వేములపల్లి: ధాన్యం ట్రాక్టర్‌ను వెనుక నుంచి డీసీఎం ఢీకొట్టింది. ఈ ఘటన వేములపల్లి మండలం శెట్టిపాలెం గ్రామ శివారులో ఆదివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తిప్పర్తి మండలం ఇండ్లూరు గ్రామానికి చెందిన జక్కలి మంగయ్య తన పొలంలో కోసిన వరి ధాన్యాన్ని ట్రాక్టర్‌లో లోడ్ చేసి తరలిస్తుండగా.. వేములపల్లి మండలం శెట్టిపాలెం శివారులోని మహర్షి మిల్లు సమీపంలో నార్కట్‌పల్లి–అద్దంకి బైపాస్‌పై ట్రాక్టర్‌ను మిర్యాలగూడ నుంచి నల్లగొండకు వెళ్తున్న డీసీఎం వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో ట్రాక్టర్ రోడ్డుకు అడ్డంగా పడి ధాన్యం మొత్తం రోడ్డుపై పడింది. దీంతో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జాం అయ్యింది. విషయం తెలుసుకున్న హైవే అధికారులు, పోలీసులు క్రేన్ సహాయంతో ట్రాక్టర్‌ను రోడ్డు పక్కకు తొలగించారు.



రోడ్డుకు అడ్డంగా పడిన ధాన్యం ట్రాక్టర్

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లోని పరికరాలు చోరీ



ట్రాన్స్‌ఫార్మర్‌లోని పరికరాలను దొంగిలించిన గుర్తుతెలియని వ్యక్తులు

అడ్డగూడూరు: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులగొట్టి అందులోని పరికరాలను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. ఈ ఘటన శనివారం రాత్రి అడ్డగూడూరు మండలం బొడ్డుగూడెం గ్రామంలో జరిగింది. స్థానికులు, విద్యుత్ లైన్‌మెన్ వెంకన్న తెలిపిన వివరాల ప్రకారం.. బొడ్డుగూడెం గ్రామానికి చెందిన కేసారపు రాంరెడ్డి వ్యవసాయ పొలంలో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేసి అందులోని రాగి, ఇత్తడి పరికరాలరు దొంగిలించారు.

ఎంబీబీఎస్ విద్యార్థినికి ఆర్థికసాయం అందజేత



గౌతమికి రూ.లక్ష చెక్కు అందజేస్తున్న సూర్యాపేట జిల్లా గౌడ ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు

సూర్యాపేట: చిన్నప్పుడే తల్లిదండ్రులు మృతిచెందడంతో తాతయ్య, నాయనమ్మ వద్ద ఉంటూ కూలీ పనులకు వెళ్తూ మంచిర్యాల ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించిన తుంగతుర్తి మండలం వెంపటి గ్రామానికి చెందిన శిగ గౌతమికి ఆదివారం సూర్యాపేట జిల్లా గౌడ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రూ.లక్ష ఆర్థికసాయం అందజేశారు. స్థానిక సంఘం కార్యాలయంలో ఆమెను ఘనంగా సన్మానించారు. గౌతమి ఎంబీబీఎస్ పూర్తిచేసే వరకు ప్రతి ఏడాది ఆమె అవసరాల నిమిత్తం ఆర్థికసాయం అందిస్తామని సంఘం సభ్యులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి కాంపాటి రాధాకృష్ణగౌడ్, బెల్లంకొండ రామ్మూర్తిగౌడ్, చిత్తలూరి యాదగిరిగౌడ్, పబ్బతి వెంకటేశ్వర్లుగౌడ్, పులుసు వెంకటయ్యగౌడ్, మెంచు వెంకన్నగౌడ్, అంజయ్య, పులుసు శ్రీనివాస్, రేసు శ్రీనివాస్, అల్లాడి సత్యనారాయణ, చలగాని నారాయణ, గునగంటి వెంకటేశ్వర్లు, సురభి శ్రీధర్‌గౌడ్, రాములు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి



శ్రీనివాసరావు (ఫైల్)

మఠంపల్లి: రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొని ఇద్దరు యువకులు మృతిచెందారు. ఈ ఘటన ఆదివారం సాయంత్రం మఠంపల్లి మండల కేంద్రంలోని సాగర్ సిమెంట్స్ పరిశ్రమ వద్ద జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మఠంపల్లి మండలం రఘునాథపాలెం గ్రామానికి చెందిన సంగు శ్రీనివాసరావు(30), పెదవీడు గ్రామానికి చెందిన షేక్ మస్తాన్(36) మండలంలోని నాగార్జున సిమెంట్స్‌లో పనిచేస్తున్నారు. శ్రీనివాసరావు భార్య నీలిమ స్థానిక ఎన్‌సీఎల్ స్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తోంది. వీరికి సంతానం కలుగలేదు. సోమవారం మట్టపల్లి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసుకునేందుకు గాను ఆదివారం పూజ సామగ్రి కోసం భార్యాభర్తలిద్దరు మఠంపల్లికి బైక్‌పై వచ్చి తిరిగి వెళ్తున్నారు. అదే సమయంలో షేక్ మస్తాన్ బైక్‌పై మఠంపల్లి వైపు వస్తున్నాడు. ఈ క్రమంలో రెండు బైకులు సాగర్ సిమెంట్ పరిశ్రమ వద్ద ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో శ్రీనివాసరావు, షేక్ మస్తాన్‌కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందారు. శ్రీనివాసరావు భార్య నీలిమకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీ సులు ఘటనా స్థలానికి చేరుకుని నీలిమను చికిత్స నిమిత్తం, మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం హుజూర్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య



వెంకన్న (ఫైల్)

నల్లగొండ క్రైం: కుటుంబ కలహాలతో జీవితంపై విరక్తి చెంది ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన నల్లగొండ పట్టణంలో ఆదివారం వెలుగులోకి వచ్చింది. నల్లగొండ రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ పట్టణంలోని పాతబస్తీ లైన్‌వాడకు చెందిన కడారి వెంకన్న అలియాస్ కోటి(52) రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కుటుంబ కలహాలతో జీవితం విరక్తి చెంది మునుగోడు రోడ్డులోని మహేంద్ర హిల్స్ వెంచర్‌లో వేప చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆదివారం ఉదయం వాకింగ్ కోసం వచ్చిన వారు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడికి భార్య కళమ్మ, కుమారుడు కళ్యాణ్ ఉన్నారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సైదాబాబు తెలిపారు.

మహిళ మృతి.. అంత్యక్రియలు చేసిన కాలనీవాసులు



కౌసల్య (ఫైల్)

కొండమల్లేపల్లి: దేవరకొండ మండలం తెలుగుపల్లి గ్రామానికి చెందిన తిప్పర్తి కౌసల్య(80) భర్త 30 ఏళ్ల క్రితం మృతిచెందడంతో కొండమల్లేపల్లి పట్టణానికి వచ్చి నివాసముంటోంది. ఆమెకు సంతానం లేకపోవడంతో ఒంటరిగా స్థానిక వినాయకనగర్‌లో ఉంటూ నిత్యం దైవ కార్యక్రమాల్లో పాల్గొనేది. శనివారం ఆమె అనారోగ్యంతో మృతిచెందింది. కౌసల్య అంత్యక్రియలు చేయడానికి ఎవరూ రాకపోవడంతో కాలనీవాసులు, శ్రీమన్నారాయణ భక్తులు దగ్గరుండి శనివారం రాత్రి అంత్యక్రియలు నిర్వహించారు.

బాలికల నెట్‌బాల్ విజేత నల్లగొండ జట్టు

- ముగిసిన రాష్ట్రస్థాయి పోటీలు



ఫాస్ట్ - 5 బాలికల విభాగంలో గెలుపొందిన నల్లగొండ జిల్లా జట్టు

నిర్మల్‌టౌన్: నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఈ నెల 8వ తేదీ నుంచి నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి అండర్–16 సబ్ జూనియర్స్ బాల, బాలికల ఫాస్ట్–5, ట్రెడిషనల్ నెట్‌బాల్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. రాష్ట్రంలోని 24 జిల్లాల నుంచి 48 జట్లు, 850 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఫైనల్స్ ట్రెడిషనల్‌లో బాలుర విభాగంలో మహబూబ్‌నగర్–నారాయణపేట జట్లు తలపడగా మహబూబ్‌నగర్ జట్టు విజయం సాధించింది. బాలికల విభాగంలో ఫైనల్‌లో మహబూబ్‌నగర్ జట్టుపై నల్లగొండ జట్టు గెలుపొందింది. ఫాస్ట్–5 ఫైనల్స్‌లో బాలుర విభాగంలో కరీంనగర్ జట్టును ఓడించి నారాయణపేట్ జట్టు విజయకేతనం ఎగురవేసింది. బాలికల విభాగంలో మహబూబ్‌నగర్–నల్లగొండ జట్లు తలపడగా నల్లగొండ జట్టు జయకేతనం ఎగురవేసింది. బీజేపీ జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి, నెట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు విక్రమ్ ఆదిత్యరెడ్డి, ప్రముఖ వైద్యుడు అవినాష్ విజేతలకు బహుమతులు అందజేశారు. నెట్‌బాల్ రాష్ట్ర సెక్రటరీ ఖాజాఖాన్, జిల్లా అధ్యక్షుడు అనిల్ కుమార్, సెక్రెటరీ మోహన్, ఎస్జీఎఫ్ సెక్రెటరీ రవీందర్‌గౌడ్, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం జిల్లా కార్యదర్శి భోజన్న, డాక్టర్ వేదవ్యాస్, ఆర్గనైజర్ వన్నెల భూమన్న, వ్యాయామ ఉపాధ్యాయులు జమున, అన్నపూర్ణ, గంగాధర్ పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి యువకుడు మృతి



నవీన్ (ఫైల్)

చివ్వెంల(సూర్యాపేట): వడ్ల రాశి యువకుడి ప్రాణాలు తీసింది. ఈ ఘటన చివ్వెంల మండలం ఐలాపురం గ్రామ శివారులో సూర్యాపేట–ఖమ్మం రహదారి సర్వీసు రోడ్డుపై ఆదివారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆత్మకూర్(ఎస్) మండలం కొత్తతండాకు చెందిన బాణోతు నవీన్(25) సూర్యాపేటలో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. ఆదివారం చివ్వెంల మండలం ఎర్రసూర్య తండాలో తమ బంధువుల ఇంటికి వెళ్లి బైక్‌పై తిరిగి వస్తుండగా.. ఐలాపురం గ్రామ శివారులో సూర్యాపేట–ఖమ్మం రహదారి సర్వీసు రోడ్డు మీద రైతులు ఆరబోసిన ధాన్యం రాశి పైకి బైక్ ఎక్కడంతో అదుపుతప్పి కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో నవీన్‌కు తీవ్ర గాయాలు కాగా.. చికిత్స నిమిత్తం సూర్యాపేట జనరల్ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ వి. మహేశ్వర్ తెలిపారు.

చిట్టీల పేరుతో కుచ్చుటోపీ

నాగార్జునసాగర్: నందికొండ మున్సిపాలటీ పరిధిలోని తెలంగాణ జెన్‌కోలో పనిచేస్తున్న ఆర్టిజెన్ ఉద్యోగి తన భార్య, మరదలితో కలిసి చిట్టీల వ్యాపారం చేస్తూ రూ.3కోట్లు కుచ్చుటోపీ పెట్టినట్లు సమాచారం. రూ.95 లక్షలు చెల్లించాల్సి ఉండగా 37 మందికి ఐపీ పెట్టి లక్ష్మీపద్మావతి పేరుతో నోటీసులు పంపారు. దీంతో చిట్టీలు వేసిన జెన్‌కో ఉద్యోగులు లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించే ప్రయత్నం చేస్తున్నారు.

మిర్యాలగూడ పట్టణంలో కార్డన్ సెర్చ్

- 30 ద్విచక్ర వాహనాలు, రెండు ఆటోలు స్వాధీనం



కార్డన్ సెర్చ్‌లో పట్టుబడిన వాహనాలను పరిశీలిస్తున్న డీఎస్పీ రాజశేఖరరాజు

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ పట్టణంలోని గాంధీనగర్‌లో ఆదివారం రాత్రి ఎస్పీ శరత్‌చంద్ర పవర్ ఆదేశాల మేరకు నార్కోటిక్ డాగ్ స్క్వాడ్ సిబ్బందితో కలిసి మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్ రాజు ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సరైన పత్రాలు లేని వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకొని వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ రాజశేఖర్‌రాజు మాట్లాడుతూ.. కార్డన్ సెర్చ్‌లో భాగంగా 30 ద్విచక్ర వాహనాలు, రెండు ఆటోలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మైనర్లు, డ్రైవింగ్ లైసెన్స్ లేని వారు వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నంబర్ ప్లేట్లు టాంపరింగ్ చేస్తే చీటింగ్ కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ కార్డన్ సెర్చ్‌లో వన్ టౌన్, టూ టౌన్ సీఐలు కరుణాకర్, నాగార్జున, ఎస్ఐలు మోహన్, కృష్ణయ్య, శ్రీనివాస్‌నాయక్, శేఖర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

తాళం వేసిన ఇళ్లలో చోరీ

చిట్యాల: చిట్యాల పట్టణంలో ఆదివారం తాళం వేసిన ఇళ్లలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిట్యాల పట్టణంలోని భవానీనగర్‌లో నివాసముంటున్న ఏనుగు నర్సిరెడ్డి ఆదివారం ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి బంధువుల పెళ్లికి వెళ్లాడు. మధ్యాహ్నం వచ్చి చూడగా తాళం పగులగొట్టి ఉండడంతో లోపలికి వెళ్లి చూడగా బీరువాలోని బంగారు, వెండి ఆభరణాలతో పాటు రూ.11వేల నగదును చోరీ జరిగినట్లు గుర్తించారు. అదే ఇంటి పక్కనే అద్దెకు ఉంటున్న గంటోజు క్రాంతికుమార్ సైతం ఇంటికి తాళం వేసి బయటికి వెళ్లగా.. అతడి ఇంట్లో సైతం బీరువాలోని బంగారు, వెండి ఆభరణాలతో పాటు రూ.6వేల నగదు దొంగిలించారు. బాధితుల ఫిర్యాదు మెరకు కేసు నమోదు చేసినట్లు చిట్యాల ఎస్ఐ ధర్మా తెలిపారు.

బేకరీపై ఎస్‌ఓటీ పోలీసుల దాడులు

ఆలేరురూరల్ : ఆలేరు పట్టణ కేంద్రంలోని మంతపురి రోడ్డులో గల ఆస్కా బేకరీలో ఆదివారం సాయంత్రం ఎస్‌ఓటీ పోలీసులు, ఆలేరు పోలీసులు దాడులు నిర్వహించారు. ఆహార పదార్థాలలో కలిపే మిక్స్‌డ్ కలర్ బాక్స్‌లు 4, మంచూరియా ఫుడ్‌లో కలిపే సింథటిక్ కలర్ బాక్స్‌లు 9(ఒక్కోటి 10 గ్రాములు) పట్టుకొని సీజ్ చేసినట్లు తెలిపారు. బేకరీ యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రజనీకర్ తెలిపారు.

సీసీఐ కేంద్రానికి పోటెత్తిన పత్తి



ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలోని సీసీఐ కేంద్రానికి వచ్చిన పత్తి

ఆత్మకూరు(ఎం): మండల కేంద్రంలోని శ్రీసిద్ధేశ్వర కాటన్ మిల్లులో ఏర్పాటు చేసిన సీసీఐ కేంద్రానికి గత మూడు రోజులుగా పత్తి పోటెత్తి వస్తోంది. శనివారం, ఆదివారం సెలవు దినాలు కావడంతో సోమవారం పెద్ద సంఖ్యలో పత్తి వచ్చే అవకాశం ఉంది. పత్తి లోడు వాహనాలు ఉదయం నుంచే తూకం వరుసలో ఉంటున్నాయి. తేమ శాతాన్ని బట్టి క్వింటాల్‌కు రూ.7220 నుంచి రూ.7500 ధర చెల్లిస్తున్నారు.

పెళ్లైన రెండు నెలలకే అనంతలోకాలకు..

- ట్రాక్టర్‌లో వెళ్తుండగా విద్యుత్ తీగలు తగిలి యువతి మృతి
- ఆమె భర్తకు తీవ్ర గాయాలు



ఘటనా స్థలంలో ట్రాక్టర్



మనీషా (ఫైల్)

కనగల్: పెళ్లైన రెండు నెలలకే ఆ యువతికి నూరేళ్లు నిండాయి. భర్తతో కలిసి ట్రాక్టర్‌లో వ్యవసాయ పొలం వద్దకు వెళ్తుండగా.. విద్యుత్ తీగలు తగిలి విద్యుదాఘాతానికి గురై యువతి మృతిచెందింది. ఆమె భర్తకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన కనగల్ మండలం అమ్మగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని కుమ్మరిగూడెంలో ఆదివారం జరిగింది. కనగల్ ఎస్ఐ పి. విష్ణుమూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. కుమ్మరిగూడెం గ్రామానికి చెందిన మాచర్ల అంజిబాబుకు గుర్రంపోడు మండలం నడికుడ గ్రామానికి చెందిన మనీషా(18)తో రెండు నెలల క్రితం వివాహం జరిగింది. భార్యాభర్తలిద్దరు కలిసి ఆదివారం ఉదయం తమ వ్యవసాయ పొలం వద్ద వరి గడ్డి కట్టలను తీసుకురావడానికి ట్రాక్టర్‌లో బయల్దేరారు. మార్గమధ్యలో 11కేవీ విద్యుత్ వైర్లు ట్రాక్టర్ ట్రాలీకి అమర్చిన ఇనుప పైపులకు తగలడంతో అంజిబాబు, మనీషా విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడ్డారు. గ్రామస్తులు గమనించి వారిని 108 వాహనంలో నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మనీషా మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అంజిబాబుకు వైద్యులు చికిత్స అందిస్తున్నారు. మృతురాలి అన్న కొండయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. లూజ్ వైర్లను సరిచేయాలని విద్యుత్ సిబ్బందిని పలుమార్లు కోరినప్పటికీ పట్టించుకోలేదని రైతులు వాపోయారు. మనీషా మృతికి విద్యుత్ అధికారుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపించారు.

అన్నంలో పురుగులు వచ్చాయని చెప్పినందుకు..

- గురుకుల విద్యార్థిని కొట్టిన ప్రిన్సిపాల్

తుంగతుర్తి: అన్నంలో పురుగులు వస్తున్నాయని ప్రిన్సిపాల్‌కు చూపినందుకు విద్యార్థి చెంప పగులగొట్టిన ఘటన తుంగతుర్తి మండల కేంద్రంలోని తెలంగాణ గురుకుల బాలుర పాఠశాలలో శనివారం జరిగింది. గురుకుల పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న గుగులోత్ యువరాజ్ శనివారం మధ్యాహ్నం అన్నం తింటుండగా అందులో పురుగులు కనిపించాయి. దీంతో యువరాజ్ అన్నంలో పురుగులు వస్తున్నాయని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సతీష్ దగ్గరకు వచ్చి చెప్పాడు. ప్రిన్సిపాల్ 'నీకు ఏం పని లేదా.. ఎప్పుడు అన్నంలో పురుగులు వస్తున్నాయని చెబుతున్నావు' అని యువరాజ్ చెంపలపై కొట్టాడు. దీంతో ఆ విద్యార్థి తన తండ్రి భాస్కర్‌కు విషయం తెలుపగా.. అతడు పాఠశాలకు వచ్చి ప్రిన్సిపాల్‌ను ప్రశ్నించాడు. ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాని ఉన్నతాధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు యువరాజ్ తండ్రి తెలిపారు.

పుల్లెల గోపీచంద్‌కు సత్కారం



పుల్లెల గోపీచంద్‌ను సన్మానిస్తున్న నల్లగొండ జిల్లా బాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు

మిర్యాలగూడ టౌన్: హైదరాబాద్‌లోని పుల్లెల గోపీచంద్ అకాడమీలో ఆదివారం జరిగిన సమావేశానికి నల్లగొండ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ టి. ప్రశాంత్, పి. నవీన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ సెక్రటరీ పుల్లెల గోపీచంద్‌ను వారు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించాలని అసోసియేషన్‌కు సూచించారు.

- ఈ దారి.. పూలదారి



ఆత్మకూరు(ఎం) మండలం టి. రేపాక-కప్రాయపల్లి గ్రామాల మధ్య బీటీ రోడ్డు వెంట ఇరువైపులా ఉన్న బతాని పూల చెట్లు పలువురిని ఆకట్టుకుంటున్నాయి. రోడ్డుకు ఇరువైపులా గులాబీ రంగులో పూచిన బతాని పూలు అందాలను పంచుతూ ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయి. – ఆత్మకూరు(ఎం)